ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి, 2025



నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

టెక్కలి : ఆంధ్రా సారస్వత పరిషత్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా ఏప్రిల్ నెలలో నిర్వహించాల్సిన ఈ పరీక్షలు ఈ ఏడాది ముందస్తుగానే నిర్వహిస్తున్నారు. సాధారణ ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల సమయాల్లోనే ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం గమనార్హం. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. టెక్కలి పట్టణంలో ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో కేంద్రాలుగా ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. పరీక్షలు సజావుగా, కఠిన తరంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సదాశివుని తిరుమల చైతన్య సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విజేత ఎవరో..?

- నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభం
- ఎయు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఏర్పాట్లు
- 'తొలి ప్రాధాన్యం' దక్కితే సాయంత్రానికే ఫలితం



విజయగౌరి



రఘువర్మ



శ్రీనివాసులునాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఫలితం సోమవారం తేలనుంది. నరాలు తెగే ఉత్కంఠకు నేటి సాయంత్రంతో తెరపడనుంది. మండలి ఎన్నికల్లో విజేత ఎవరన్న అంశంపై ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొద్ది రోజులుగా విపరీత చర్చ నడుస్తోంది. ఫలితం కోసం ఎదురుచూసే వారిలో ఉపాధ్యాయులే కాకుండా సాధారణ ప్రజానీకమూ ఉన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదిక కానుంది. గత నెల 27న ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగ్గా 20783 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.

లెక్కింపు ప్రక్రియ ఇలా...

ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎయు ఇంజినీరింగ్ కాలేజీ ట్రిపుల్ ఇ విభాగం భవనాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు దశల్లో సాగే లెక్కింపు ప్రక్రియ పూర్తయి విజేత పేరు ప్రకటించేందుకు 8 నుంచి 10 గంటల సమయం పడుతుందని ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. లెక్కింపు ప్రక్రియలో తొలుత అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లు తొలగించి, బ్యాలెట్ బాక్సులను లెక్కించి హాల్లోకి తరలిస్తారు. 123 బ్యాలెట్ బాక్సుల లెక్కింపునకు 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. తొలిదశలో బాక్సుల్లో ఓట్లను ఆరు రౌండ్లలో వెలికితీసేందుకు కనీసం మూడు గంటల సమయం పట్టనున్నట్టు తెలుస్తోంది. రెండో దశలో పోలైన ఓట్లను 25 చొప్పున కట్టలు కడతారు. అలా వెయ్యి ఓట్లను ఒక పెద్ద డ్రమ్ములో వేస్తారు. ఈ మేరకు మరో 2 గంటల సమయం పడుతుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత మూడో దశగా అభ్యర్థులకు పోలైన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లకు ఒకటి కలిపి అందులో 50 శాతం ప్లస్ 1 ఓట్లు వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అంటే ఉదాహరణకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 20 వేలు చెల్లుబాటయితే.. వాటికి ఒక ఓటు (20,001) కలుపుతారు. అందులో 50 శాతం ప్లస్ 1 అంటే... విజేతకు 10,001 ఓట్లు రావల్సి ఉంటుంది. అలా తొలి ప్రాధాన్యత ఓట్లు 10,001 వస్తే విజేత పేరును వెంటనే ప్రకటిస్తారు.

తొలి ప్రాధాన్యతతో విజేత తేలకపోతే...

తొలి ప్రాధాన్యతా ఓట్లలో విజేత తేలకుంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అప్పుడు పోటీ చేసిన అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన వారి నుంచి ఎలిమినేషన్ రౌండ్ ఆరంభమవుతుంది. ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్తే పూర్తి ఫలితం వచ్చేసరికి 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని, ఈ లెక్కన సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల్లోపు విజేత పేరు ప్రకటించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ జరిగిన తీరు, బరిలో నిలిచిన వారిలో త్రిముఖ పోటీ నెలకొనడంతో మొదటి ప్రాధాన్యతా ఓట్లుతో విజేత ప్రకటన సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఏమైనా ఇబ్బందులు ఎదురైనా, ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి వచ్చినా ఫలితం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఒక వేళ తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజేత ఎవరో తేలితే.. సాయంత్రం 4 గంటలకే ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రధాన పోటీ ఆ ముగ్గురి మధ్యే!


పది మంది మండలి బరిలో ఉన్నా ప్రధానమైన పోరు యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, బిజెపి మద్దతునిచ్చిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, టిడిపి, జనసేన మద్దతునిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మధ్యనే నెలకొంది.

పోలింగ్ జరిగిన తర్వాత వచ్చిన వార్తల ప్రకారం.. రఘువర్మను గెలిపించుకోడానికి అధికార పార్టీ నాయకులంతా ఉత్తరాంధ్ర అంతటా పలు అక్రమ పద్ధతులకు పాల్పడడం ఉపాధ్యాయుల్లో వ్యతిరేకతను పెంచేలా చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన పిడిఎఫ్ అభ్యర్థి పట్ల గురువులు మక్కువ చూపినట్టు చర్చ సాగుతోంది. గడిచిన తొమ్మిది నెలల పాలనా కాలంలో గురువుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి కొనసాగడం అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి రఘువర్మకు నెగెటివ్ అయ్యిందన్న మాటలు వినిపించాయి. పిఆర్‌టియు నుంచి నిలబడి బిజెపి మద్దతు పొందిన గాదె తరుపున సొంత సంఘమే కాకుండా ఒకటీ అరా సంఘాలు పనిచేశాయని, ఈ నేపథ్యంలో ఆయనా రేసులో ఉన్నారని తెలుస్తోంది. ఏదేమైనా ఇంకొన్ని గంటల్లో విజేత ఎవరో తేలనుంది.



ఎయులోని కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు





బర్డ్ ఫ్లూ... భయపడొద్దు

- జిల్లాలో భారీగా తగ్గిన చికెన్ విక్రయాలు
- బర్డ్ ఫ్లూ వార్తలతో కొనుగోలుకు అనాసక్తి
- భారీగా పడిపోయిన చికెన్ ధర
- లబోదిబోమంటున్న ఫౌల్ట్రీ నిర్వాహకులు
- ఆందోళన అవసరం లేదంటున్న అధికారులు

బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. చికెన్ ప్రియులు ముక్క ముట్టాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల్లో సంభవించిన కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని నిర్ధారణ కావడంతో జిల్లాలోని కోడి మాంస ప్రియులు ఒకింత కలవరపాటుకు గురవుతున్నారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేకుపోయినా తినేందుకు భయపడుతున్నారు. దీంతో చికెన్ విక్రయాలు గణనీయంగా పడిపోవడంతో ఫౌల్ట్రీ నిర్వాహకులు, చికెన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. జిల్లాకు బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని, చికెన్ తినేందుకు భయపడాల్సిన అవసరం లేదని పశు సంవర్ధకశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రజాశక్తి - నౌపడ / సంతబొమ్మాళి

ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి చనిపోవడం, చికెన్ తిన్న వారికీ ఇది సోకుతుందని విస్తృతంగా ప్రచారం సాగడం ఫౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. బర్డ్ ఫ్లూ వార్తలతో చికెన్ కొనేందుకు ప్రజలు అనాసక్తి చూపుతున్నారు. ముక్క లేనిదే ముద్ద దిగని చికెన్ ప్రియులు సైతం కొనేందుకు వణికిపోతున్నారు. దీంతో చికెన్ వ్యాపారం జోరుగా సాగే ఆదివారం కూడా విక్రయాల్లేక చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే సుమారు 1.30 కేజీల వరకు విక్రయాలు సాగుతుంటాయి. మిగిలిన రోజుల్లో రోజుకు 50 వేల కేజీల వరకు చికెన్‌ను విక్రయిస్తుంటారు. బర్డ్ ఫ్లూ వార్తల ప్రభావంతో ఆదివారం 15 వేల నుంచి 20 వేల కేజీల వరకు విక్రయాలు సాగాయని ఫౌల్ట్రీ, చికెన్ వ్యాపారులు చెప్తున్నారు. ధర తగ్గించి విక్రయించినా ఆశించిన స్థాయిలో చికెన్ ప్రియులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు.

లబోదిబోమంటున్న ఫౌల్ట్రీ నిర్వాహకులు

జిల్లాలో సుమారు 200 వరకు ఫౌల్ట్రీ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో బ్రాయిలర్ ఫారాలు 175 వరకు ఉండగా, లేయర్ ఫారాలు 25 వరకు ఉన్నాయి. సుమారు ఐదు వేల కుటుంబాలు కోళ్ల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. 20 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. బర్డ్ ఫ్లూ వార్తల ముందు వరకు చికెన్ రూ.280 వరకు ఉండేది. ప్రస్తుతం అది రూ.130 నుంచి రూ.150కి పడిపోయింది. పడిపోయిన ధరలతో లైవ్ రూ.90 పలుకుతోంది. ఈ ధరలతో గిట్టుబాటు కావడం లేదని ఫౌల్ట్రీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కోడిగుడ్ల విక్రయాలు కూడా పడిపోయాయని, ప్రస్తుతం ఒక గుడ్డు రూ.ఐదారు పలుకుతోందని తెలిపారు. కొనుగోల్లేక ధరలు పడిపోవడంతో వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, కోళ్లఫారాలు, చికెన్ దుకాణాల్లో పనిచేసే వారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్న ఫౌల్ట్రీ యాజమాన్యాలు

మరోవైపు ఫౌల్ట్రీ యాజమాన్యాలు కోడి మాంసం, గుడ్ల వినియోగంపై అపోహలను తొలగించడానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చికెన్, గుడ్డు మేళాలను నిర్వహించాయి. కోడి మాంసం, గుడ్లతో తయారు చేసిన ఉచిత వంటకాలను అందించాయి. కోడి మాంసం, గుడ్లు రెండూ చౌక ధరలకు లభించే అధిక ప్రోటీన్ కలిగిన ఆహారాలు అని నిర్వాహకులు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారాలను నమ్మొద్దని, ఎలాంటి భయం లేకుండా చికెన్ తినవచ్చని విస్తృత ప్రచారం చేస్తున్నారు.

జిల్లాలో ప్రభావం లేదు



బర్డ్ ఫ్లూ ప్రభావం జిల్లాలో లేదు. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలతో ముందస్తు పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. బర్డ్ ఫ్లూ వైరస్ 70 డిగ్రీల సెంటిగ్రేడ్, అంతకన్నా ఎక్కువ వేడి దగ్గర బతకలేదు. మనం వంద డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద చికెన్ ఉడికిస్తామని... అందువల్ల ఎలాంటి ప్రభావం, ప్రమాదం లేదు.

- డాక్టర్ కె.రాజగోపాల్
జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

జీడి కార్మికులకు... వేతన ఒప్పందం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - మందస

జీడి యాజమాన్యాలు కార్మికులకు వేతన ఒప్పందం వెంటనే చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. మండలంలోని జీడి పరిశ్రమల కార్మికుల సమావేశం సారంగిపురం సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జీడి యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని విమర్శించారు. గత వేతన ఒప్పందం ముగిసి ఎనిమిది నెలలు ముగిసినా, నూతన వేతన ఒప్పందం చేయలేదన్నారు. జీడి యాజమాన్యాలు కార్మికులపై నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే వేతన ఒప్పందం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు, బి.చంద్రమ్మ, హేమావతి, బి.భారతి, జి.బాలమ్మ, సిహెచ్.జానకమ్మ పాల్గొన్నారు.

డ్రోన్‌తో చట్టవ్యతిరేక చర్యలకు అడ్డుకట్ట

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ, బైరివానిపేట, నాగావళి రివర్ వ్యూ పార్కు, బలగ తదితర నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాల్లో ఆదివారం డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టినట్లు చెప్పారు. పాడుపడిన బంగ్లాలు, నివాసాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి, బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం వంటి వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అటువంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.



విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు



పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు యోగా, సాంస్కృతిక కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహిస్తున్న మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టల్స్, పాఠశాలలను సంబంధిత పోలీసు అధికారులు సందర్శించి, విద్యార్థినులకు యోగా తరగతులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు, ఆకతాయిల వేధింపుల, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నుండి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థినులకు పోలీసులు, పోలీస్‌స్టేషన్లపై ఉన్న అభద్రతాభావం తొలగిపోయి, వారి సమస్యలు ఉంటే స్నేహపూర్వక వాతావరణంలో పోలీసు అధికారులకు సులభంగా తెలియజేసేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తద్వారా వారి భద్రతకు మరింత మెరుగైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అక్రమ కట్టడాలపై నిఘా

- పారిశుధ్య నిర్వహణపై దృష్టి
- ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లు వేగవంతం
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు





ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అక్రమ కట్టడాలపై నిఘా పెట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ డివివిఎస్ ప్రసాదరావు అన్నారు. అలాగే రక్షిత తాగునీటి పథకాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందుతోందన్నారు. శత శాతం పన్నుల వసూళ్లపై ఇప్పటికే దృష్టి పెట్టామన్నారు. పారిశుధ్య నిర్వహణ పెద్ద సవాల్‌గా ఉందన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను ఎరువుగా మార్చుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణలో గతేడాది జాతీయ స్థాయిలో ఉత్తమ నగరపాలక సంస్థగా అవార్డు దక్కించుకోగలిగామని అన్నారు. ఈ ఏడాది అదే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు కాలువల్లో పూడిక తీతపనులు చేపట్టాం. నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉండడంతో నివారణా చర్యలు చేపడుతున్నామన్నారు. టాంకర్ల ద్వారా ఇప్పటికే దోమల నివారణకు పిచికారీ కొనసాగుతున్నట్టు వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? అక్రమ నిర్మాణాలను అడ్డుకట్టకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నగరపాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న భవన నిర్మాణ రంగంలో ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా కట్టడాలకు అనుమతులు ఇస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలను విస్మరించి నిర్మిస్తే... చర్యలు తప్పవు. భవన నిర్మాణాలపై పురపాలకశాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. తమ పరిధిలోని భవనాలను సచివాలయాల ప్రణాళికాకార్యదర్శులు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో చర్యలు మొదలు పెడతారు. అనుమతుల్లేని నిర్మాణాలతో పాటు, తీసుకున్న అనుమతులకు భిన్నంగా కట్టడాలు ఉన్నా వాటిని గుర్తించి చర్యలు చేపట్టేందుకు వీలుగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పర్యవేక్షణకు నిశిత పరిశీలనకు అవకాశాలు మెరుగుపడ్డాయి. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసేందుకు పురపాలకశాఖ అనధరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్ ఐడెంటిఫికేషన్ అండ్ మానిటరింగ్ సిస్టం (యుసిఐఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. భవనాలు, బహుళ అంతస్తుల సముదాయాలను యాప్‌లో పొందుపర్చే ప్రక్రియ కొన సాగుతోంది.

? నగర సుందరీకరణ ఎంతమేరకు పూర్తి చేశారు?

నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి వీలుగా నగర సుందరీకరణ పనులు ప్రారంభించాం. సుందరీకరణ నిరంతర ప్రక్రియ. అవసరం ఉన్న ప్రతి పనికీ నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల నిర్వహించిన రథసప్తమి వేడుకల సందర్భంగా నగరంలోని అరసవల్లి రోడ్డు, కళింగ రోడ్డు విద్యుద్దీకరణ, సెంటర్ డివైడర్ నిర్మాణం చేపట్టాం. పాలకొండ రోడ్డులో ఉన్న చెట్లను తొలగించి సెంటర్ డివైడరును పునర్నిర్మించి విద్యుద్దీకరణ చేపట్టాం. నగరం మధ్యలో నాగావళి నది ప్రవహిస్తుండడం ప్రజలు వేసవిలో సేద తీరేందుకు నదిపై ఉన్న వంతెనలు సహకరిస్తున్నాయి. వాటిని సుందరంగా తీర్చి దిద్దాలని భావించి ఇప్పటికే రంగులు వేశాం. ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ రహదారి ఫ్లైఓవర్లు వద్ద అందంగా తైలవర్ణ చిత్రాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. రోడ్ల అభివృద్ధిపైనా దృష్టిసారించాం.

? పార్కుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

నగరంలో గూనపాలెం, ఎల్.బి.ఎస్.కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, హడ్కో కాలనీ, అఫీషియల్ కాలనీ పార్కు, గాంధీ పార్కు, రివర్ వ్యూ పార్కు, కార్గిల్ పార్కులను అభివృద్ధి చేశాం. పార్కుల పరిరక్షణ స్థానికులే పర్యవేక్షించడంతో మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. వారు విస్మరిస్తే పరిరక్షణ సాధ్యం కాదు. పెద్ద పార్కుల అభివృద్ధికి అనువైన స్థలాలు గుర్తించాల్సి ఉంది. పాత పార్కుల సుందరీకరణ చేపడుతున్నాం. నగర సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు. సీపన్నాయుడుపేట వద్ద ఉన్న విజయాదిత్య పార్కును అభివృద్ధి చేశాం.

? ప్లాస్టిక్ వాడకం నిషేధం అమలు ఎలా ఉంది?

నగరంలో శతశాతం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాం. ఇప్పటికే పాలిథిన్ సంచుల వినియోగంపై పెద్దఎత్తున ప్రచారం, అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం, విక్రయదారులతో సమావేశాన్ని నిర్వహించాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గతేడాది నవంబరు ఒకటి నుంచి ప్లాస్టిక్ ఫెక్సీలను నిలుపుదల చేయాలని ఆదేశించాం. ఫ్లెక్సీ యజమానులతో ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించి ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలని సూచించాం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిషేధాన్ని తప్పక అమలు చేస్తాం. ప్రజలు సహకరించాలి.

? నీటిఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

రానున్న వేసవిలో నగర వాసులకు ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నాగావళి నదిలో తాగునీటి బావుల వద్ద నీరు లభ్యత ఆధారంగా నీటి సరఫరాకు వీలుంది. పుష్కలంగా నీరు ఉన్నప్పుడు తాగునీటి కొరత ఉండదు. అందుకే వేసవి సీజన మొదట్లోనే రక్షిత తాగునీటి పథకాల నిర్వహణలో భాగంగా బావుల వద్ద ఇసుక మేటలు తొలగించాం. సీజన్‌లో క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. నదిలో నీరు అడుగంటినప్పుడు నీటి కొరత రాకుండా భూగర్భజలాలు వృద్ధి చెందడానికి నది అంతర్భాగంలో డైక్ నిర్మాణం చేపట్టాం. వేసవిలో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. వరద నుంచి కాపాడేందుకు రూ.62 లక్షలతో రింగ్ బండ్ పనులు చేపట్టాం. మరోవైపు బలగ, శాంతినగర్ కాలనీ, ఖాజీపేట, కిల్లిపాలెం ప్రాంతాల్లోని బావుల వద్ద నీటిని వడిసి పటేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నగర వాసులకు ఎప్పటిలాగే రెండు పూటలా తాగునీరు కుళాయిల ద్వారా అందిస్తున్నాం.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జెకెసి ఆధ్వర్యాన ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నిట్, ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, ఐఎస్‌యుజెడ్‌ఎ, యాక్ట్ తదితర 12 కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. 690 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు, 8 నుంచి 35 ఏళ్లు ఉన్న పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి జీతంతో పాటు, ఇఎస్ఐ, ఇపిఎఫ్, మెడి క్లెయిమ్స్, రిటెన్షన్ బోనస్, సబ్సిడైజ్డ్ ఫుడ్, వసతి, రవాణా సౌకర్యాలతో కలిపి రూ.15 వేల నుంచి రూ.65 వేలు వరకు వేతనం లభిస్తుందన్నారు.

ఆసక్తి గలవారు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) వద్దకు ఉదయం 9.30 గంటలకు ఆధార్ కార్డు, అర్హత ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని జెకెసి కో-ఆర్డినేటర్ వై.మణికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9949094968, 9346577596 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



మెమెంటోలను అందజేస్తున్న విజయ

సేవలకు గుర్తింపు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కవిటి: గెస్ట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన బల్లెడ శంకరరావు వృత్తిరీత్యా ఉపాధ్యాయునిగా ఒకే పాఠశాలలో 40 ఏళ్ళు అందించిన సేవలకు లభించిన గుర్తింపే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించడమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బొరివంకలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శంకరరావు మాస్టారుకు విజయ అవార్డులను ప్రదానం చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలోనే చదువు చెప్పే అవకాశం రావడం అందులోనూ వృత్తి జీవితం మొత్తం ఒకే పాఠశాలలో నిర్వహించడం అరుదైన విషయమన్నారు. మాస్టారు వృత్తి జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యులు రాజేంద్రప్రసాద్, ఆనిగి రామకృష్ణ, పలు స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులు, ఎన్నికలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రంజాన్ మాసం మొదలు కావడంతో ముస్లింల ఉపవాస దీక్షలు ఆదివారం ఆరంభమయ్యాయి. నెలరోజుల పాటు సాగే ఈ దీక్షల సందర్భంగా క్రమశిక్షణ, శాంతి, సహనానికి ప్రతీకైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టారు. నగరంలోని జామియా మసీదుతో పాటు ఇతర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి మొదలైన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రంజాన్ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

స్వప్రయోజనాల కోసం గిరిజనులతో ఆటలా..?

ప్రజాశక్తి- బూర్జ

స్వప్రయోజనాల కోసం గిరిజనుల జీవితాలతో ఆటలాడుతుంటే చూస్తూ ఊరుకోమని ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ హెచ్చరించారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట, పాలకొండ, శ్రీకాకుళం జిల్లాలోని సరుబుజ్జిలి మండలాల్లోని తిమ్మడం, జంగాలపాడు, వెన్నెలవలస, మశానపుట్టి తదితర గిరిజన గ్రామాల్లో సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. ఇటీవల ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు నాయకులు సన్నాహాలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. గిరిజనులు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 16 ఎకరాల్లో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. పోడు వ్యవసాయం, కొండల్లో జీవనమే అలవాటైన గిరిజనులను థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు పేరుతో బయట ప్రపంచానికి తరలించే ప్రయత్నం చేయడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత ఎమ్మెల్యే గత టిడిపి ప్రభుత్వ



గిరిజనులతో మాట్లాడుతున్న గాంధీ

హయాంలో 2014లో పూలతోటలు, పండ్ల తోటలు పెంచుకునేందుకు తన భార్య పేరున 100 ఎకరాలను ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేశారు. అయితే అది సాధ్యం కాకపోవడంతో ఇప్పుడు గిరిజనులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. ఎన్నో గ్రామాలు అడవిని, కొండలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, అయితే కేవలం వ్యక్తిగత స్వార్థంకోసం వ్యక్తిగత కక్షతో ఈ విధంగా పూనుకోవడం సరికాదన్నారు. ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడం వలన ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బూటకపు మాటలు చెప్పడం సరికాదన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు తీవ్ర పరిణామాలు ఎదురు అవుతాయని తెలిపారు. గిరిజనులకు పోడు వ్యవసాయం తప్ప మరో పని ఎరగరని తెలిపారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని లేనిపక్షంలో గిరిజనులతో కలిసి పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పొందూరు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువ్వారి సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి రాపాక పోతురాజు, సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి కొరుకొండ సాయికుమార్, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు బి.సురేష్ దొర, సింహాచలం, లక్ష్మణరావు, పైడి విజయరమణ, అచ్చిపోలవలస సర్పంచ్ పైడి చంద్రమణి, చింతాడ శివ, పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, సురేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

సమాజ శ్రేయస్సే 'వాకర్స్' లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ నిర్మాణానికి శ్రేయస్సుకు పాటుపడే స్వచ్ఛంద సంస్థలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిలవడం ఎంతో గర్వంగా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. స్టార్ వనితా వాకర్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు అరవై ఏళ్ళు దాటిన వారు మాత్రమే వాకింగ్, జాగింగ్, ఇతర వ్యాయామాలు చేసేవారని నేడు అన్ని వయసుల వారు నిత్య జీవితంలో వాకింగ్ ఒక భాగంగా చేసుకొని నడుస్తున్నారన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక రోగాల నుంచి ఉపశమనం పొందాలంటే నడకే మార్గమన్నారు. 'నడువు.. నడిపించు' అనే నినాదంతో అందరికీ సేవ చేసే భాగ్యం వాకర్స్ క్లబ్స్ కల్పిస్తుందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ శ్రీకాకుళం సాధనలో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నూతన గవర్నర్ కొంఖ్యాన మురళీధర్, మాజీ గవర్నర్ పీజీ గుప్తా, సంస్థ ప్రతినిధులు కర్రోతు సత్యం, ప్రకాశరావు, గుడ్ల సత్యనారాయణ, ఎలక్ట్ గవర్నర్ తిరుపతిరావు, ఆర్ట్స్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, ఎన్‌సిసి అధికారి డాక్టర్ యాల్ల పోలినాయుడు. స్టార్ వాకర్స్ క్లబ్ ఫౌండర్ గేదెల ఇందిరా ప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, రత్నాల వరప్రసాద్, డాక్టర్ జి.నారాయణరావు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నూతన గవర్నర్ కె. మురళీధర్ సారథ్యంలో



మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

ప్రమాణ స్వీకారం చేశారు. స్టార్ వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా గుడ్ల జగ్గారావు, కార్యదర్శిగా గోలి ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా బి.దేవీప్రసాద్, స్టార్ వనితా వాకర్స్ అధ్యక్షులుగా గేదెల లక్ష్మీ, కార్యదర్శిగా వి. వాసంతి, కోశాధికారిగా అడపా శాంతి ఎన్నికయ్యారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కొత్త పారసాంబ జాతీయ రహదారిపై ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రాముకు తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి నుంచి సోంపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా... పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా రామును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాముకు రెండు కాళ్లు విరిగిపోయాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది సత్యం, రాజేష్ ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కాశీబుగ్గ పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కాశీబుగ్గ బస్టాండ్ వద్ద సోంపేటకు చెందిన వేణు అనే వ్యక్తి ఫిట్స్ రావడంతో కిందకు పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. ఘటనా జరిగిన వెంటనే 108 సిబ్బంది సత్యం, వెంకట రావులు క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

వైసిపి బిసి సెల్ అధ్యక్షునిగా హరినారాయణ



హరినారాయణ

వజ్రపుకొత్తూరు: వైసిపి నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షునిగా మద్దిల హరి నారాయణను నియమిస్తూ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలోని రెయ్యిపాడుకు చెందిన హరినారాయణ గతంలో వజ్రపుకొత్తూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ఉపాధ్యక్షునిగా సేవలు అందించారు. వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. మాజీ మంత్రి అప్పలరాజుకు విధేయుడుగా ఉండటంతో గుర్తింపు లభించింది. హరినారాయణ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహించి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి, అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని బూర్జ మండలంలో చేపట్టనున్న 455 అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 29 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్న సిసి రహదారులు, కాలువల నిర్మాణాలకు రూ.41.43 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఈ నిధుల మంజూరుకు జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తర్వులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ రిసోర్స్‌పర్సన్‌గా గోవిందరావు



గోవిందరావు

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్‌లో శ్రీకాకుళం జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పూజారి గోవిందరావు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. సంస్థ నుంచి ఈ మేరకు నియామకపు పత్రాలను జారీ చేశారు. ఈనెల 20 నుంచి 22 వరకు న్యూఢిల్లీలో సంస్థ ఆధ్వర్యాన నిర్వహించనున్న వర్క్‌షాపునకు ఆయన హాజరు కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపికైన గోవిందరావును జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. తిరుమల చైతన్యతో పాటు ఉప విద్యా శాఖాధికారిణి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అరసవల్లికి తగ్గిన రద్దీ


శ్రీకాకుళం అర్బన్: మాఘమాసం పూర్తి కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ కొంత మేరకు తగ్గు ముఖం పట్టింది. ఆదివారం ఆలయానికి వివిధ రూపాల్లో వచ్చే ఆదాయం తగ్గింది. ఆదివారం రూ.6.19 లక్షల ఆదాయం సమకూరిందని ఇఒ వై.భద్రాజీ తెలిపారు. టికెట్లు విక్రయాల ద్వారా రూ.3,77,100, విరాళాల రూపంలో రూ.68,837, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 1,73,460 ఆదాయం సమకూరినట్లు ఇఒ తెలిపారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

లావేరు: ప్రతి విద్యార్థి పరీక్షలు అయినంత వరకు రోజూ యోగా చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు యోగాపై స్పెషల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యోగా అవసరమన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వలన పబ్లిక్ పరీక్షల్లో మానసిక ఒత్తిడి, భయం, ఆందోళన ఉండవని, పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించగలరన్నారు. ఈ సందర్భంగా పద్మాసనం, వజ్రాసనం, హలాసనంతో పాటు 32 ఆసనాలు వేసి విద్యార్థులతో చేయించారు. పరీక్షలైనంత వరకు ప్రతి ఆదివారం ఉదయం యోగపై క్లాస్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయకుడు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.



బహుమతిని అందజేస్తున్న తహశీల్దార్

క్విజ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలో పాత శ్రీకాకుళంలో గల ఆక్స్‌ఫర్డు స్కూల్ విద్యార్థులు క్విజ్ పోటీల్లో సత్తా చాటారు. నగరంలో ఆదివారం నిర్వహించిన ప్రాంతీయ స్థాయి క్విజ్ పోటీల్లో 11 పాఠశాలల విద్యార్థులు పోటీపడ్డారు. కరెంట్ ఎఫైర్స్‌పై నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.తేజశ్రీ ప్రథమ స్థానం, పదో తరగతి చదువుతున్న సిహెచ్ కార్తిక్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్య రమేష్ బాబు తెలిపారు. విజేతలకు స్థానిక తహశీల్దార్ రామారావు బహుమతులను అందజేసి అభినందించారు.

విలువలతో కూడిన విద్య అవసరం



రక్తదానం చేస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, అప్పుడే వారు ఉన్నత లక్ష్యాలకు చేరుకోగలరని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్‌లో 31వ వార్షికోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్మోహనరావు మాట్లాడుతూ చిన్నారుల్లో క్రమశిక్షణ, ఉన్నత విలువలను పెంపొందించి వారి లక్ష్యాలు ఉన్నతంగా ఉండేలా తీర్చిదిద్దడంలో న్యూ సెంట్రల్ స్కూల్ ఎప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. ఒక్క రోజులోనే 251 ప్యాకెట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ రమాకుమారి, పాఠశాల డైరెక్టర్లు పి.శ్రీకాంత్, శ్రీదేవి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రక్తదానం ప్రాణదానంతో సమానమని, తోటి వ్యక్తి ప్రాణాలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో ఉన్న న్యూ బ్లడ్ బ్యాంక్ శ్రీకాకుళంలో అమ్మ హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అందవరపు జ్యోతిర్మయి ఆధ్వర్యంలో రక్తదాన దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానేటి శ్రీధర్ మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రక్తం కొరత ఏర్పడుతుందని ఈ విషయాన్ని గ్రహించిన ఓ మహిళ రక్తదాన శిబిరం నిర్వహించేందుకు పూనుకోవడం అభినంద నీయమన్నారు. అనంతరం ఆయా రంగాల్లో రాణిస్తున్న మహిళలను శాలువాలతో సత్కరించి మెమొంటోలు



జ్యోతిర్మయిని సత్కరిస్తున్న శ్రీధర్ తదితరులు

అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ సంస్థల ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, జైశ్రీరామ్, దూసి సంతోష్, తొత్తిడి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక కుటుంబాలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షునిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన తాండ్ర జనార్ధనరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న సైనిక సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో మాజీ సైనికుల ఫౌండర్ సూర అవతారం ఆధ్వర్యంలో గెలిచిన ప్యానల్ సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జనార్ధనరావు మాట్లాడుతూ పట్టణంలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడమే తమ అందరి లక్ష్యమన్నారు. అలాగే మాజీ సైనికులకు, వీర నారీమణులకు ఎటువంటి కష్టం వచ్చినా తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఎప్పటిలాగే డిస్ట్రిక్ ఎక్స్‌సర్వీస్ మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళానికి అఫిలియేషన్ కంటిన్యూ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్యానెల్ ఉపాధ్యక్షులుగా పేడాడ సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కో-ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ ప్రతినిధి కటకం పూర్ణచంద్రరావు, జామి రమణయ్య, బర్రి సంజీవరావు అన్నెపు మురళీధరరావు, సనపల సత్యనారాయణ, పప్పల రాజారావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సావిత్రమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా ముగిసింది. మండల అభివృద్ధి, ప్రగతి అధికారుల సమన్వయంతోనే సాధ్యమవుతుందని ఎంపిపి అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నాటుసారా రహిత మండలంగా తీర్చిదిద్దుతామనిఎక్సైజ్ సిఐ కృష్ణారావు అన్నారు. మండలంలోని జొన్ని, కోణంగి, పూతికగూడ, చేపరాయిగూడ గ్రామాల్లో ఇటీవల విస్తృతంగా పర్యటించి అవగాహన కల్పించామన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కమిటీలో ఎంపిపి, సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ కృష్ణారావు

విఆర్‌ఒలు, పోలీసులు, మహిళా పోలీసులు ఉంటారని తెలిపారు. నాటుసారా నియంత్రణకు టోల్ ఫ్రీ నంబరు 14405కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉషారాణి, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి 'చింతాడ'కు లేదు



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబును విమర్శించే స్థాయి వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్‌కు లేదని జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు అన్నారు. ఆదివారం పట్టణ టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిని కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నారని, ఆ విషయం కూడా తెలుసుకోకుండా అవగాహన రాహిత్యంతో మాట్లాడడం తగదన్నారు. గడచిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కాలం వెల్లదీసిందని, పోలవరం ప్రాజెక్టును ఆటకెక్కించందన్నారు. ఎనిమిది నెలల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.300 కోట్ల నిధులను మంజూరు చేయించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఉద్యోగుల కోసం మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదని రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు గడచిన ఎన్నికల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపేశారన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు నూక రాజు, పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, బిసి సెల్ పట్టణ అధ్యక్షుడు తంగి గురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ క్లారెట్' వార్షికోత్సవం

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని సెయింట్ క్లారెట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో గుణాత్మక విద్యను అందించేందుకు పాఠశాల చేస్తున్న కృషిని అభినందించారు. 23 ఏళ్ళుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ఇదే పాఠశాలలో చదువుకున్న ఇద్దరు పూర్వ విద్యార్థులు వైద్యులుగా ప్రభుత్వాస్పత్రిలో పనిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే



మెమొంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పాఠశాల యాజమాన్యం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మెమొంటోలను అందజేశారు.



విద్యార్థులతో తులసీదాస్‌రెడ్డి

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు

ఇచ్ఛాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని స్వర్ణభారతీ విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం విద్యా సంస్థల ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు అవసరమైన ప్లాంక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ చాట్ల నీలిమరెడ్డి, సుజాత, ఎఒ రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సందీప్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బాహుదా రోడ్డు వంతెన ప్రాంతంలో తరచూ సంభవిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన వేగనియంత్రణ బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్ చర్యలు తీసుకున్నారు. ఈదుపురం రోడ్డులో వంతెనపైన, బాహుదా రోడ్డు వంతెన మార్గం, తులసమ్మ ఆలయం కూడలి వద్ద మట్టి దిమ్మలు శుభ్రపరచి వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేశారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ప్రజలకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ... చర్యలు తీసుకుంటున్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

అరసవల్లి: నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సిడిపిఒ శోభనా రాణి అన్నారు. 8న మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ ఏ కార్యక్రమం నిర్వహించాలో తీర్మానించారు. అందులో భాగంగా శనివారం కిశోరి బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శోభనారాణి మాట్లాడుతూ మహిళలను గౌరవిద్దాం... దేశ ప్రాభవాన్ని పెంచుదామని నినదించారు. మహిళలంటే అణుకువ కాదు మహిళ అంటే మానవాభివృద్ధికి మరో శిఖరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.ఉమ, బి.లక్ష్మీ, ఎస్.జయలక్ష్మి, ఎం.శ్రీలక్ష్మీ, ఎన్.పద్మావతి, వై.పైడితల్లి, బి.సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రాండ్ టెస్టు

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి గ్రాండ్ టెస్టు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రశ్నా పత్రాలు ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లకు చేరాయి. మధ్యాహ్నం ఒంటి గంటన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది నుంచే గ్రాండ్ టెస్టు నిర్వహించడం గమనించదగ్గ విషయం. ఈనెల 13 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగు రోజుల వ్యవధిలోనే మరలా వార్షిక పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఒకపక్క పరీక్షలపై భయాన్ని విడనాడాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా. మరోపక్క విశ్రాంతి లేకుండా పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పరీక్షలపై మరింత ఆందోళన కలుగుతుంది. ఇటీవల ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి కొద్దిరోజులు సమయం గడిచిన వెంటనే మరలా గ్రాండ్ టెస్టు పేరుతో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురతారని విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తుండటం గమనించదగ్గ విషయం.

పిసిఎంఎ అధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస



ఎన్నికైన పిసిఎంఎ సభ్యులు

పలాస జీడి మాను పాక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమైంది. వచ్చే రెండేళ్ల కాలానికి కార్యవర్గ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిటీ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు 8 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 4న ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. వీరిలో ఐదుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ముగ్గురే మిగిలిపోయారు. దీంతో ఎన్నికల కమిటీ అధ్యక్షునిగా మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శిగా టంకాల రవిశంకర్‌గుప్త, కోశాధికారిగా మల్లా సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.



పలక లేని హెడ్ వాల్

పలకలు వేసేదెప్పుడు?

కొత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జలజీవన్ పథకం భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించే సంకల్పంతో వీధులకు వెళ్లే ప్రధాన పైపులు హెడ్ వాల్ చాంబర్ ఏర్పాటు చేశారు. ఈ పథకం ప్రారంభించి ఏడాది పాటు అవుతుంది. చాంబర్‌పై పలకలు వేయాల్సి ఉండగా.. కాంట్రాక్టర్ మరిచి పోయారు. మండల కేంద్రంలో పది హెడ్ వాల్ చాంబర్లు ఏర్పాటు చేసి ఉన్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద పలకలు అమర్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పాదచారులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుచున్నారు.



మాట్లాడుతున్న రమణ

నైపుణ్యంతో కూడిన శిక్షణ

పలాస: నైపుణ్యతతో కూడిన శిక్షణల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వి.రమణ అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బ్యూటీషియన్, సర్వీస్ ప్రొవైడర్ల శిక్షణ శిబిరాలను ఆదివారం పరిశీలించారు. చేతివృత్తులతో పనిచేస్తున్న యువతీ యువకులకు మెరుగైన శిక్షణలు ఇచ్చి ప్రజలకు అవసరమైన వేళ ఉపయోగపడేలా ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఎంఎం మోహన్, టి.ఎల్.ఎఫ్ అధ్యక్షులు టి.రాజ్యలక్ష్మి, జీవన్ చేతివృత్తుల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి కుమారుడు మృతి



నాగిరెడ్డి (ఫైల్)

నౌపడ: సంతబొమ్మాళి మండలం మాజీ ఎంపిపి కర్రి కృష్ణవేణి కుమారుడు కర్రి నాగిరెడ్డి (44) ఆదివారం వేకువజామున మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. 2014-19 సమయంలో కృష్ణవేణి ఎంపిపిగా పని చేశారు. తండ్రి టిడిపి సీనియర్ నాయకులు కర్రి విష్ణుమూర్తి నౌపడ సర్పంచ్‌గా పలుమార్లు పనిచేశారు. నాగిరెడ్డి మృతిపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, మండల టిడిపి నాయకులు సంతాపం తెలియజేశారు.